

రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

క్లుప్తంగా

ట్రాక్టర్ కొనుగోలుకు నిధులు మంజూరు



ఎంపీ మాగుంటను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీకి ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి రూ 12.50 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌తో కలిసి చైర్మన్ అబ్దుల్ గఫార్ సోమవారం ఒంగోలులో ఎంపీ మాగుంటను కలిసి మున్సిపాలిటీలో పారిశుధ్య పనులకు ట్రాక్టర్ మంజూరు చేయాలని కోరగా..ఆయన వెంటనే ఎంపీ గ్రాంట్స్ నుంచి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. దీంతో ఎంపీ మాగుంట కు ఎమ్మెల్యే బుర్రా, చైర్మన్ గఫార్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, సీనియర్ న్యాయవాది ఎం సుబ్రహ్మణ్యం, హైకోర్టు న్యాయవాది మందిరాల బ్రహ్మారెడ్డి తదితరులున్నారు.

స్పందనకు 11 వినతులు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 11 అర్జీలు వచ్చాయి. కనిగిరి నుంచి 5, కొనకనమిట్ల 1, హెచ్ఎంపాడు 1, వెలిగండ్ల 2, పాదిలి 1, పామూరు నుంచి ఒక అర్జీ అందినట్లు వీఆర్ఓ రఘురామయ్య తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ టి.అజయ్‌కుమార్ అన్నారు. డీఏఓ జయవర్ధన్, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

జరుగుమల్లి: బాలికలు క్రీడల్లో రాణించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పచ్చవ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎ.వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఫణికుమారి, ఎంవీ లావణ్య రూ.5 వేలతో క్రీడా దుస్తులు కొనుగోలు చేసి 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 25 మంది బాలికలకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారిని పాఠశాలలోని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

జీవన ఎరువులపై అవగాహన అవసరం

పీసీపల్లి: రైతులు జీవన ఎరువులపై అవగాహన కలిగి ఉండాలని ఒంగోలు డీఆర్‌సీ ఏ శైలజారాణి అన్నారు. మండల పరిధిలోని తలకొండపాడు, చినవరిమడుగు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు జీవన ఎరువులపై సోమవారం పొలాల్లోనే ప్రయోగాత్మకంగా వివరించారు. చినవరిమడుగులో మిరప సాగు చేసిన 10 మంది రైతులకు వామ్ జీవన ఎరువులు పంపిణీ చేశారు. వీఏఏలు కళ్యాణ్, విజయ్ రైతులు పాల్గొన్నారు.

తేమను నిల్వ చేసే పోషకాలు వాడాలి

పీసీపల్లి: తేమను నిల్వ చేసే పోషకాలు వాడాలని ఒంగోలు డీఆర్‌సీ శైలజారాణి అన్నారు. మండల పరిధిలోని చింతగుంపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని బత్తాయి పంట వేస్తున్న రైతులకు ఆత్మా ఫార్మర్ ఓరియెంటెడ్ పథకం 2023-24 కింద పూసా హైడ్రోజన్ ఉచితంగా పంపిణీ చేసి రైతులకు పొలంలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ ఎరువును పశువుల ఎరువుతో కలిపి పొలాల్లో వినియోగిస్తే నీటిని పీల్చుకొని ఎప్పుడు తేమగా ఉంచుతాయన్నారు. వీరి వెంట ద్వారశిల నరసింహారెడ్డి, చిలకల నారాయణరెడ్డి ఉన్నారు.

చంద్రబాబు అరెస్టుతో ఎన్టీఆర్‌కు ఘనమైన నివాళి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



శానంపూడి ఆటోస్టాండ్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న వరికూటి

సింగరాయకొండ: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో వందల కోట్లు దోపిడీ చేసి పక్కా ఆధారాలతో దొరికిపోయిన టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టుతో ఎన్టీ రామారావుకు ఘనమైన నివాళి దక్కిందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎన్టీఆర్ అభిమానులు పడుతున్న ఆవేదనకు చంద్రబాబు అరెస్టు ఓ ముగింపు ఇచ్చిందన్నారు. స్థానిక శానంపూడి బస్టాండ్ సెంటర్‌లో సోమవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి కేసులో అడ్డంగా దొరికిన చంద్రబాబుకు న్యాయస్థానం రిమాండ్ విధిస్తే టీడీపీ నాయకులు బంద్ ప్రకటించి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేంటని మండిపడ్డారు. 14 ఏళ్లపాటు చంద్రబాబు ప్రజా ధనం లూటీ చేస్తూ, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారని విమర్శించారు. బాబు అవినీతిపై దమ్ముంటే ఆధారాలు చూపాలని విర్రవీగిన టీడీపీ నేతలు ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టీడీపీ పాలనలో బడుగు బలహీన వర్గాలను అణగదొక్కారని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించిన వారికి చివరకు నిరాశే మిగిలిందన్నారు. కేవలం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌కు మాత్రం భారీగా ఉపాధి లభించిందని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టుతో పేదవర్గాలు ఆనందంగా ఉన్నాయని చెప్పారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఆ పార్టీ నేతల నుంచే స్పందన కరువైందని, ఆ పార్టీ నేత అచ్చెంనాయుడు టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మాటలే అందుకు నిదర్శనమన్నారు. పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అని విమర్శిస్తున్న నారా లోకేష్ ఊచలు లెక్కబెట్టే సమయం దగ్గరపడిందని వరికూటి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అరాచకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ సోషల్‌మీడియా కార్యకర్తలకు సూచించారు. అనంతరం కందుకూరు రోడ్డు సెంటర్‌లో పార్టీ నేతలతో కలిసి టిఫిన్ చేసిన వరికూటి.. నిర్వాహకురాలితో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ, పార్టీ జిల్లా కార్యదర్శి సామంతుల రవికుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, ముళ్లపూడి సత్యన్నారాయణ, పిట్టా బ్రహ్మయ్య, షేక్ సుల్తాన్, షేక్ కరీం, జి.శ్రీహరిరెడ్డి, చామల వేణుగోపాలరెడ్డి, షేక్ కాలేషా, రాజు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కందకూరు రోడ్డు సెంటర్‌లో టిఫిన్ తింటున్న వరికూటి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బుర్రా



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, పక్కన చైర్మన్, ఎంపీపీ

- ఎండీఎఫ్ నిధులు రూ.6 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి

కనిగిరి రూరల్: కలెక్టర్ దినేష్‌కుమార్‌ను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సోమవారం ఒంగోలులో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా కనిగిరి మున్సిపాలిటీలోని బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన భూ బాధితులకు పరిహారం త్వరగా చెల్లించాలని, హైవే రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. మున్సిపాలిటీలో నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజు నీటిని సరఫరా చేస్తున్నామని, సంబంధిత కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే (ఎండీఎఫ్) మినరల్ డెవలప్మెంట్ ఫండ్ కింద రూ. 6 కోట్లు నిధులు పట్టణానికి మంజూరు చేసి పట్టణంలోని వార్డుల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని విన్నవించారు. తొలుత వివిధ అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, చైర్మన్ గఫార్‌లు కలెక్టర్‌కు దినేష్‌కుమార్‌కు అందచేశారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం తదితరులున్నారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ పునర్నిమానికి సోమవారం బక్కమంతుల నాగరాజు, ప్రభావతిల దంపతులు రూ 25,116లు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంకమ్మతల్లి ఆలయ మొదటి దశ నిర్మాణం పూర్తయిందని, రెండో దశ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సూరం వేణుగోపాల్‌రెడ్డి, కొడాలి కోటేశ్వరరావు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సమష్టిగా అడుగులు వేద్దాం

- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో అందరం సమష్టిగా ముందుకు సాగుదామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. కనిగిరి మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సహకారంతో పట్టణంలో అభివృద్ధిని మరింత వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్‌డీఎస్ స్కీం(రివ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద పట్టణ శివారు ప్రాంతాలైన కాశీపురం, కాశిరెడ్డి కాలనీ, మాచవరం, చింతలపాలెం గ్రామాల్లో రూ.4 కోట్లతో విద్యుత్ ఆధునికీకరణ, 24 గంటల విద్యుత్ సరఫరా, నాణ్యమైన విద్యుత్ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు, వైరింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మున్సిపల్ నిధులతో 20 వార్డుల్లో సుమారు 150 నూతన విద్యుత్ పోల్స్‌నుఏర్పాటు చేసినట్లు చెప్పారు. నూతన మున్సిపాలిటీ భవనం, మటన్, చికెన్, ఫిష్ కూరగాయల మార్కెట్ల నిర్మాణాలకు రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, త్వరలో నిధులు మంజూరు కానున్నట్లు చెప్పారు. కోటి రూపాయలతో కనిగిరి చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. రూ.25 లక్షలతో పట్టణంలోని ప్రధాన రోడ్డులో అక్రమణలు తొలగించి విస్తరణ చేపట్టనున్నట్లు చెప్పారు. జీజీఎంలో మంజూరై టెండర్లు పిలిచిన రోడ్లను త్వరగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ప్రతి పనికి ముందుగా ప్రీ ఆడిట్ విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల ఆఫీసులో వివిధ పనులకు సంబంధించిన బిల్లుల అపోలోడ్‌లో ఆలస్యం జరుగుతున్నట్లు చెప్పారు. ఒక బిల్లు అప్‌లోడ్‌కు 12 రకాల ప్రొసీజర్‌లతో బిల్లు థంబ్‌లను అధికారులు వేయాల్సి ఉంటుందని, దీనిపై క్షేత్ర స్థాయిలో సిబ్బందికి అవగాహన లోపం, అధికారుల కొరత వల్ల బిల్లుల ప్రొసిజర్ చేసే క్రమంలో కొంత జాప్యం జరుగుతున్నది వాస్తవం అని, దీనిపై ఎటువంటి అపోహలు పడోద్దని చెప్పారు. కొందరు కావాలని మున్సిపాలిటీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

సమస్యలపై సభ్యుల విన్నపాలు..

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు వివిధ సమస్యలపై విన్నవించారు. వైస్ చైర్మన్ పులి శాంతి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక ప్రణాళికద్వార చర్యలు చేపట్టాలన్నారు. ఆఫీసులో ఫైల్స్ ప్రొసిజర్ తగు క్రమంలో ఎందుకు జరగడం లేదని, సిబ్బంది చేసే విధులేమిటి అని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ 2 ఆర్ మాణిక్యరావు మాట్లాడుతూ జీజీఎంలో తన వార్డులో మంజూరైన రోడ్డు, డ్రైనేజీ పనులు జరగలేదని వాపోయారు. కౌన్సిలర్ వేల్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వార్డులో డీప్ బోర్‌వెల్ మరమ్మతులకు గురైందని, రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణాలు చేపట్టలేదని దీనిపై ఎన్ని సార్లు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కౌన్సిపల్ పసుపులేటి దీప మాట్లాడుతూ 20 వార్డులో నీటి సమస్య తీవ్రంగా ఉందని, కనీస రోడ్డు అభివృద్ధి పనులు జరగలేదన్నారు. 12వ వార్డు కౌన్సిల్ శ్రీరాం సతీష్ మాట్లాడుతూ అభివృద్ధిని కొన్ని వార్డులకే పరిమితం చేస్తే రానున్న రోజుల్లో ఇబ్బందులు పడతామన్నారు. తన వార్డులో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. కోఆప్షన్ సభ్యుడు లింకన్ మాట్లాడుతూ తన వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ 20 వార్డులో వారం లోగా ఫాగింగ్ ప్రక్రియ చేపడతామన్నారు. నీటి సమస్యపై తక్షణం నివేదికలు తయారు చేసి, అన్ని వార్డుల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏఈ కోటేశ్వరరావును ఆదేశించారు. కాంట్రాక్టర్ల లోపం వల్ల కొన్ని రోడ్ల అభివృద్ధి ముందుకు సాగలేదని, తక్షణం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని చెప్పారు. బొడ్డు చావిడి సెంటర్ నుంచి నాజ్ సెంటర్ వరకు ఉన్న ప్రధాన రోడ్డులో ఆగిన రోడ్డు అభివృద్ధి పనులు రూ.25లక్షలతో చేపట్టేందుకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణల తొలగింపుకు తక్షణం చర్యలు తీసుకోవాలని టీపీఓను ఆదేశించారు. 23 అంశాలతో కూడిన అజెండాతో మున్సిపల్ సమావేశం జరిగింది. సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమాలు అమలు చేయాలి



పిల్లిపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం (పామూరు): పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమాలను విధిగా అమలు చేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని పిల్లిపల్లి, బోయమడుగుల, తుంగోడు, చిన్నకొటాలపల్లి, వెంకటాయపల్లి, బోడావులదిన్నె పాఠశాలలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలు అమలవుతున్నాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యం చేయాల్సిన పనులను ఆచరించాలని ఉపాధ్యాయులకు సూచించి స్వచ్ఛతా కార్యక్రమంపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన చేశారు. పీఎంసీ కమిటీ సాయంతో విద్యార్థులకు స్వచ్ఛత ఆవశ్యకత గురించి వివిధ పోటీలు, క్విజ్, కార్టూన్లు వేయడం విద్యార్థులకు అలవర్చాలన్నారు. మధ్యాహ్న భోజన మెనూ, రికార్డులను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2.36 లక్షలు



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం వరకు రూ.2,36,579 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జి.రమణారెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,06,100, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.29,870, శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.80,093, ఇతర విరాళాలు రూ.20,516 వచ్చినట్లు పేర్కొన్నారు. అన్నదానానికి వెలిగండ్ల మండలం రామగోపాలపురం గ్రామానికి చెందిన రాగిపిండి శివనారాయణ, లక్ష్మీకుమారి దంపతులు రూ.,0,116, వైఎస్సార్ కడప జిల్లా గోపవరం మండలం ఉప్పలవారి గ్రామానికి చెందిన లకిడి నారాయణ, జ్యోతి దంపతులు రూ.10,116 విరాళాన్ని ఈఓకు అందజేశారు. జిలకర నారాయణమూర్తి, కొమ్మినేని వెంకట్రావు, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆర్బీకేల్లో 316 టన్నుల ఎరువులు



వావిలేటిపాడులోని రైతు భరోసా కేంద్రం

జరుగుమల్లి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు ఎరువులు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖాధికారి డి.యుగంధర రెడ్డి తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా 81 టన్నులు, డీఏపీ 50 టన్నులు, 20:2013, 28:28:0 ఎరువులు 60 టన్నులు, అమ్మోనియం సల్ఫేట్ 125 టన్నులు వెరసి మొత్తం 316 టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయని వివరించారు. 2023-24 ఏడాదికి సంబంధించి జరుగుమల్లి మండలంలో 1500 టన్నుల ఎరువులు రైతులకు అవసరమవుతాయని అంచనా వేశామని, అందుకు తగిన నిల్వలను సిద్ధంగా ఉంచేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఈ ఏడాది అమ్మోనియం సల్ఫేట్ కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి రవాణా ఖర్చు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను పొందే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి యుగంధరరెడ్డి సూచించారు.

రైతుల భూ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీయం నాయకులు

సీఎస్‌పురం (పామూరు): రైతుల భూ సమస్యలను రెవెన్యూ సిబ్బంది త్వరితగతిన పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా రైతుల భూ సమస్యల పరిష్కారంలో కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరాకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన రైతులు భూసమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటే సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. భూముల ఆన్‌లైన్, పట్టాదారు పాస్‌పుస్తకాలు, తప్పుల సవరణ, కొత్తగా సాగు భూముల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణం సమస్యలు పరిష్కారమయ్యేలా, డిమాండ్లు పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్.తిరుపతిరెడ్డి, జవ్వాజి మోహన్, గండి తిరుమలయ్య, జయంపు బాలగురవయ్య, మంచే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి కూరగాయలు ఎంతో శ్రేష్టం



వ్యవసాయ ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్

కనిగిరి రూరల్: ప్రకృతి కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టమైనవని ఏడీఏ ఈ వెంకట రమణ అన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రినర్ డి.విజయరాణి, సిబ్బంది పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. తక్కువ ధరకు, నాణ్యమైన, ఆరోగ్య కరమైన తాజా కూరగాయలను అందచేస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి పురుగుల మందులు, ఎరువులు వాడకుండా ఈ కూరగాయలను పండించామన్నారు. ప్రతి సోమవారం కూరగాలయ స్టాల్స్ జరుగుతుందని, పట్టణ ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

హనుమంతునిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 12, 13 వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ జి.పెద్దిరాజు, హెచ్ఎం జీవీ సురేష్‌బాబు, డి.జిలానీలు తెలిపారు. అండర్ 14 అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థులను తీసుకరావాలని కోరారు. పోటీలో పాల్గొనే విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేసి క్రీడాకారుల ఎంట్రీ ఫారం పూర్తి చేసి పంపించాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. అన్ని వివరాలకు పీడీ షేక్ జిలానీబాషను సంప్రదించాలని కోరారు.

వెలిగండ్ల: ఈ నెల 13, 14 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం బి.రాఘవచారి, ఫిజికల్ డైరెక్టర్ వి. రామారావు తెలిపారు. 13న అండర్-14 విభాగంలో బాలబాలికలు, 14న అండర్-17 విభాగం బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. బ్యాడ్మింటన్, షటిల్, బాల్‌బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, త్రోబాల్, వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని హెచ్ఎం రాఘవచారి, పీడీ వి.రామారావు కోరారు.

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని సి.నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 13న క్రీడాకారుల ఎంపిక ఉంటుందని స్కూల్ గేమ్స్ చైర్మన్, హెచ్ఎం మందా కుమారి, మండల కో ఆర్డినేటర్ షేక్.నాయబ్‌రసూల్ తెలిపారు. పోటీలు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, బాల్ బాడ్మింటన్, షటిల్, వాలీబాల్, టెన్నికాయిడ్, యోగా, అథ్లెటిక్స్‌లో బాల బాలికలను ఎంపిక చేస్తామన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన మండలంలోని అన్ని పాఠశాలల యాజమాన్యాల విద్యార్థులు ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే పోటీల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు.

బంద్ ప్రభావం శూన్యం



సింగరాయకొండలో యథావిధిగా తిరిగిన ఆర్టీసీ బస్సులు

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సోమవారం బంద్ ప్రభావం కనిపించలేదు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ, జనసేన, సీపీఐ పార్టీలు బంద్‌కు పిలుపునిచ్చాయి. అయితే దుకాణాలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా కొనసాగాయి. కొండపిలో కొందరు దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి మధ్యాహ్నం నుంచి కార్యకలాపాలు కొనసాగించారు. సింగరాయకొండ, టంగుటూరులో అన్ని దుకాణాలు, సంస్థలు తెరిచే ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. పొన్నలూరు, మర్రిపూడి, జరుగుమల్లి మండలాల్లో అస్సలు బంద్ విషయమే తెలియదన్నట్లు ప్రజలు తమ పనులు చేసుకున్నారు.

పామూరు: టీడీపీ అధ్యక్షుడు రాచంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను నిరసిస్తూ టీడీపీ నాయకులు సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. కాగా మండలకేంద్రమైన పామూరుతోపాటు మండలంలో ఎక్కడా ప్రజలు బంద్‌కు మద్దతు ప్రకటించలేదు. ఎప్పటిలాగా యథావిధిగా దుకాణాలు, వాహనాలు, ఆర్టీసీబస్‌లు, అన్ని వ్యాపార సంస్థలు పనిచేశాయి.

హనుమంతునిపాడు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుని అరెస్టు చేసి రిమాండ్ విధించడంతో టీడీపీ పిలుపునిచ్చిన బంద్ ప్రభావం కనిపించలేదు. సోమవారం మండలంలో బంద్ ప్రభావం ఎక్కకా కనిపించలేదు. కొంత మంది నిరసన తెలిపేందుకు ప్రయత్నించినా పోలీసులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వెలిగండ్ల: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ సోమవారం తలపెట్టిన బంద్ వెలిగండ్ల మండలంలో ఎక్కడా కనిపించలేదు. షాపులు, హోటళ్లు , ప్రభుత్వకార్యాలయాలు. పాఠశాలలు యథావిధిగా జరిగాయి. ప్రజలు యథావిధిగా రోజువారీ కార్యక్రమాలు నిర్వహించారు. బస్సులు, ఆటోలు , ఇతర వాహనాలు యథావిధిగా తిరిగాయి.



టంగుటూరులో తెరిచే ఉన్న దుకాణాలు